క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మాచర్ల: మొహర్రం సందర్భంగా తూర్పు బావి ప్రాంతంలోని పీర్ల చావిడి వద్ద భారీ స్థాయిలో పీర్లను ఊరేగించారు. పెద్దలు, యువకులు ఎంతో ఉత్సాహంతో పీర్ల పండుగ సందర్భంగా ప్రత్యేక అలంకరణతో చావిడి నుంచి పట్టణంలో ఊరేగింపు చేశారు. వాటిని మంగళవారం పీర్లను యథావిధిగా చావిడిలో ఉంచుతారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చీరతో ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భవానీపురం స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం ఊర్మిళానగర్‌కు చెందిన పోట్ల నాగమణికి పల్నాడు జిల్లా గురజాలకు చెందిన రామారావుతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. గొడవల కారణంగా ఐదేళ్ల క్రితం నాగమణి భర్తను వదిలి పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వచ్చింది. అప్పటి నుంచి భవానీపురం రైతు బజారులో కూరగాయల వ్యాపారం చేస్తోంది. ఈ క్రమంలో రైతు బజార్‌లో రెండేళ్ల కిందట శ్రీనివాస్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడితో కలిసి సహజీవనం చేస్తోంది. విషయం తెలుసుకున్న నాగమణి తల్లి సైదమ్మ మందలించింది. అతడితో తిరగొద్దని, భర్త వద్దకు వెళ్లాలని కోరింది. దీంతో ఆమెపై కోపం పెంచుకున్న నాగమణి నెల రోజుల క్రితం హెచ్‌బీ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. రూ.15 లక్షలు అప్పులు చేయగా ఆమె తల్లి సైదమ్మ అప్పులు తీర్చింది. ఈనెల 4న మాచర్లలో ఉంటున్న సైదమ్మ మరిది మృతి చెందడంతో ఆమె అక్కడికి వెళ్లింది. నాగమణి కూడా మాచర్ల వెళ్లి కార్యక్రమం పూర్తవగానే అదే రోజు ఇంటికి తిరిగి వచ్చింది. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో నాగమణి చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి సైదమ్మకు స్థానికుల ద్వారా సమాచారం అందగా.. ఆమె విజయవాడ వచ్చింది. శ్రీనివాస్ తన కుమార్తెను వేధించేవాడని తెలిసిందని, ఆమె మృతికి కారణాలు తెలుసుకోవాలని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటల బీమాను రైతులు ఉపయోగించుకోవాలి

పిడుగురాళ్ల: ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ డివిజనల్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంటల బీమా పథకానికి కంది పంటకు ఎకరానికి రూ.40, మిరప పంటకు రూ.360, వరి పంటకు రూ.80, పత్తి పంటకు రూ.1900 ప్రీమియం దగ్గరలోని పోస్టాఫీసులో గాని, గ్రామ సచివాలయంలో గాని చెల్లించాల్సిన ఉంటుందని చెప్పారు. అన్ని పంటలకు జూలై 31 చివరి గడువు కాగా, వరి పంటకు ఆగస్టు 15 వరకు చెల్లించవచ్చునని ఆయన తెలిపారు. కౌలు రైతులు కౌలు రైతు కార్డు ద్వారా ప్రీమియం చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

గీతా మందిరంలో ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలోని భగవద్గీతా మందిరంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. గీతా గురూజీ పందిరి శ్రీశైలం జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శిష్యులకు తినిపించారు. కార్యక్రమంలో సూరె నాగలక్ష్మి, తిరివీధి శిరీష, ఆత్మకూరు సీతమ్మ, వేముల అనసూర్య, ముప్పవరపు సీతమ్మ, శైలజ, గుడిపాటి వెంకట్రావమ్మ, యిమ్మడిశెట్టి, చీదెళ్ల భార్గవి, కళావతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు గుడ్ షెపర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. గుడ్ షెఫర్డ్ సంస్థ కో ఆర్డినేటర్ సిస్టర్ యాంటో మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలకు దూరంగా ఉండి చదువుకు దగ్గరగా ఉండాలన్నారు. సంస్థ సిబ్బంది నూతక్కి దిలీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. అవసరమైన మేరకే ఇంటర్నెట్‌ను వినియోగించుకోవాలన్నారు. అవసరం లేని లింకులను ఓపెన్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ నాగశౌరీలు, ప్రధానోపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు, సైదా నాయక్ సంస్థ సిబ్బంది బాబు, పవన్, మరియమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు లేకుండా చదువులు సాగేదెలా!

- 450 మందికి కేవలం నలుగురు టీచర్లు
- బయాలజీ, తెలుగు సబ్జెక్ట్‌లకు బోధన లేక..
- టీచర్ల కొరత దూరమవుతున్న విద్యార్థులు



విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

విజయపురిసౌత్: దక్షిణం విజయపురి ఉన్నత పాఠశాల సమస్యలతో సతమతమవుతోంది. విద్యార్థులు సంఖ్య దండిగా ఉంది. కానీ ఉపాధ్యాయులు లేరు. నలుగురంటే నలుగురు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. గతంలో డెప్యూటేషన్ వచ్చిన టీచర్లు బదిలీపై వెళ్లిపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

వివరాలు.. నాగార్జున సాగర్‌లోని దక్షిణ విజయపురి ఉన్నత పాఠశాలలో సుమారు 450పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం 4గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గతంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఎన్ఆర్ఐ షేక్ చంద్‌పాషా కృషితో డెప్యూటేషన్‌పై టీచర్లను నియమించారు. అయితే ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించింది. అందులో భాగంగా డెప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులు మాతృస్థానాలకు వెళ్లిపోయారు. దీంతో మళ్లీ ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఇక్కడ అధిక శాతం మంది విద్యార్థులు పేదల కావడంతో ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే పరిస్థితి లేదు. తల్లిదండ్రులు చిన్నారుల భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు.

తల్లిదండ్రుల ఆనాసక్తి..

ఈ చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న పేద విద్యార్థులకి ఇదొక్కటే ఉన్నత పాఠశాల. ఈ పాఠశాలలో నుంచి డ్రాప్ అవుట్ అయితే విద్యార్థులకి ప్రత్యామ్నాయం వేరొకటి లేదు. కొంతమంది తల్లిదండ్రులు తమ విద్యార్థులని 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాచర్లలో ప్రైవేట్ స్కూల్‌కి పంపించడానికి తమకు ఆర్థిక స్తోమత లేదని, ఆటోలలో ప్రయాణం చేసి విద్యార్థులు ప్రమాదాలకి గురవుతున్నారని వాపోతున్నారు. ఉపాధ్యాయుల కొరతపై పాఠశాల హెచ్‌ఎం డి.జ్యోతి, నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారికి విన్నవించినట్లు చెబుతున్నారు.

విద్యార్థులకు అన్యాయం

విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం ఇస్తున్నా. గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉపాధ్యాయుల కొరత అన్న మాట నన్ను ఎంతో వేదనకు గురిచేసింది. పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. విద్యార్థులకి ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే ప్రభుత్వం ఈ పాఠశాల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకుని, శాశ్వత పరిష్కారం చూపాలి.

–షేక్ చాంద్‌పాషా, ఎన్ఆర్ఐ

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న మహాజన సోషలిస్ట్ పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు

రెంటచింతల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ జన్మదినం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డిపర్తి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కేక్‌కు కట్‌చేసి పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల యువసేన అధ్యక్షులు డేగల జక్రయ్య మాదిగ, సీనియర్ నాయకులు డేగల దానయ్య మాదిగ, ఆడెపు జక్రయ్య మాదిగ, మామడి శేఖర్ మాదిగ, ఎరువ వెంకటయ్య మాదిగ పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగూరి అశోక్‌కుమార్ మాదిగ, మాదిగ ఉద్యోగుల సామాఖ్య గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కారసాల విజయబాబు మాదిగలు హాజరయ్యారు. మాదిగ మహిళా సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సుశీల, గురజాల నియోజకవర్గ అధ్యక్షులు మాచవరపు సాగర్, సంద్రపాటి నాగేశ్వరరావు, ఓబులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్ ఆధ్వర్యంలో సోమవారం విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు.

దోమలు నివారణకు చర్యలు

మాచర్ల: దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా డ్రెయిన్లలో నివారణ మందు పిచికారికి ప్రత్యేకంగా సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు కేటాయించారు. ప్రజలూ తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాపిస్తాయని, నీటి ట్యాంకులను శుభ్రంగా చూసుకోవాలన్నారు.

10న మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్

గురజాల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 10వ తేదీ మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఉప్పల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఈ మీటింగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



కేసానుపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



తిరునాళ్లలో సందడి చేస్తున్న ప్రజలు

దాచేపల్లి: మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చావిడిలలో అలంకరణ చేసిన పీర్లను బయటకు తీశారు. మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. ఇళ్ల వద్దకు పీర్లు వచ్చిన సమయంలో భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పీర్ల వద్ద మొక్కులు తీర్చుకొని దట్టీలు సమర్పించారు. దాచేపల్లి, కేసానుపల్లి, తంగెడ, పొందుగుల, రామాపురం, తక్కెల్లపాడు, పెదగార్లపాడు, శ్రీనగర్, గామాలపాడు, ముత్యాలంపాడు తదితర గ్రామాల్లో చావిడిలలోని పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించిన తర్వాత చావడి ల వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నుంచి పీర్లు పట్టిన వారు దాటారు. ఈ వేడుకను తిలకించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో చావిడిల వద్దకు చేరుకున్నారు. మొహర్రం సందర్భంగా దాచేపల్లి తిరునాళ్లని ఘనంగా జరుపుకున్నారు. దాచేపల్లిలోని మూడు గంధం పీర్లతో పాటు చావిడలను పీర్లను గ్రామ పురవీధులు ఊరేగించారు. భక్తులు పీర్ల వద్ద మొక్కులు తీర్చుకున్నారు. దాచేపల్లి తిరునాళ్ల నేపథ్యంలో పాత పోలీస్ స్టేషన్ వద్ద జెయింట్ విల్ తోపాటు పలు రకాల యంత్రాలను బిగించడంతో వాటిని ఎక్కేందుకు ప్రజల ఆసక్తి చూపారు. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయండి

రెంటచింతల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని స్థానిక మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, రెంటచింతల ఎంపీటీసీ గాలి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గురజాల పట్టణంలో...

గురజాల రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: దివంగత మహానేత, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్ కుమార్ అన్నారు. జయంతి కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు.

పేదవాడి గుండెచప్పుడు వైఎస్సార్

డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: ప్రతి పేదవాడి గుండెచప్పుడు దివంగత మహానేత రాజశేఖరరెడ్డి అని డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 23వ వార్డులోని స్కూల్‌లో గురజాల నియోజకవర్గ మున్సిపల్ కన్వీనర్ జూలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దివంగత మహానేత జయంతి సందర్భంగా నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.... విద్య, వైద్యం, రైతులు ఎప్పటికి దివంగత మహానేత రాజశేఖర రెడ్డిని గుర్తు పెట్టుకుంటూనే ఉంటారన్నారు. అదేవిధంగా రాబోయే ఎంతో మందికి ఆదర్శంగా పరిపాలన చేసిన మహోన్నతమైన వ్యక్తి వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని, గతంలో నేడు- నేడు ద్వారా ఎన్నో స్కూల్ రూపురేఖలను మార్చారని, అదేవిధంగా అమ్మ ఒడికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

పారిశ్రామిక రంగాల్లో పెరుగుతున్న సంక్షోభం



సభను జయప్రదం కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు కూలీ సంఘం నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్ స్థూపం వద్ద డిసెంబర్ ఒకటో తేదీ అంగడి చెన్నయ్య, కొప్పుల కోటయ్యల వర్ధంతి సందర్భంగా పారిశ్రామిక రంగాల్లో పెరుగుతున్న సంక్షోభం- మన కర్తవ్యాలు అనే అంశంపై నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు నీలాద్రి రాంబాబు మాట్లాడుతూ... అంగడి చెన్నయ్య, కోటయ్య ఈ దేశంలో భూస్వామ్య వ్యవస్థ నాశనం కావాలని, పెట్టుబడి దారి వ్యవస్థ అంతం కావాలనే లక్ష్యంతో, నూతన ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పి పేద, ధనిక తేడా లేకుండా అందరూ సమానంగా ఉండాలని కోరుకుంటూ తమ జీవితాంతం కృషి చేసిన వారి యొక్క ఆశయాలను పరిపూర్తి చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, ఆశ్రాయేలే, కృష్ణ, వెంకాయమ్మ, రాజు పాల్గొన్నారు.

పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు..



ప్రభుత్వ పర్యావరణ సలహాదారు జాజిని సన్మానిస్తున్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కారెంపూడి: గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నీటి వనరుల సంరక్షణ కోసం పచ్చని చెట్లను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పచ్చని చెట్లే ప్రగతికి కూడా మూలమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ సిద్ధ లింగమూర్తి పేర్కొన్నారు. సోమవారం రాత్రి కారెంపూడి మండల పరిషత్ కార్యాలయంలో అటవీ పర్యావరణ పరిరక్షణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు (జాజి)తో ఈ విషయమై పీడీ చర్చించారు. గ్రామాల్లో పెంచదగిన వృక్షాలను వాటి ప్రాముఖ్యత మానవాళికి అవి ఏ విధంగా ఉపయోగపడతాయనే విషయాన్ని జాజి వివరించారు. వేప, రావి, మర్రి, కానుగ తదితర వృక్షాల ఉపయోగాలు అవి ఏవిధంగా మానవాళితో పాటు పశుపక్ష్యాదులకు ఏ విధంగా ఉపయోగపడతాయనే విషయాలను వివరించారు. నల్లమల ఔషధ మొక్కలకు నిలయమని వాటి పరిరక్షణకు చర్యలు ఆవశ్యమని జాజి వివరించారు.

విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి పాఠశాలలో పెంచాల్సిన చెట్లు వృక్షాలు అలాగే గ్రామాల ప్రధాన కూడళ్లతో పాటు నలు దిక్కుల ఉండాల్సిన వృక్షాల గురించి వాటి వల్ల ఒనగూడే ప్రయోజనాలను వివరించారు. జాజి సలహాలు సూచనలు తీసుకుని తగిన కార్యాచరణతో ముందుకువెళతామని పీడీ చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ పండ్ల తోటల పెంపకానికి అలాగే పర్యావరణహిత సాగు విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న విషయాన్ని పీడీ వివరించారు. ఉద్యాన పంటల పరిరక్షణ ద్వారా కూడా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని పీడీ సిద్ధ లింగమూర్తి పేర్కొన్నారు. సందర్భంగా ప్రభుత్వ పర్యావరణ సలహాదారు జాజిని పీడీ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దివ్వెలకు సత్కారం

సత్తెనపల్లి: భరతమాత అన్నప్రసాద వితరణ పథకాన్ని ప్రారంభించి 713 రోజులు పూర్తి చేసిన సందర్భంగా పథకం బాధ్యుడు దివ్వెల శ్రీనివాసరావు సేవలను పలువురు కొనియాడారు. పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కల్యాణ మండలంలో ఆర్యవైశ్య సేవా సమితి అధ్యక్షుడు వి.శరత్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం శ్రీనివాసరావును సత్కరించారు.

జూలై 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



పిడుగురాళ్ల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్ల పట్టణంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. బంగ్లా సెంటర్, జానపాడు రోడ్డు, పిల్లుట్ల రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో అదానీ, అంబానీ లాంటి కార్పొరేటర్ సేవలు మునిగి తేలారని, కార్మికుల హక్కులను కాలరాసే విధానాలను అమలు చేసే భాగంగా బ్రిటిష్ కాలం నుంచి పోరాట సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు వేతన కోడ్స్ తీసుకొచ్చిందని, దీని వలన ఉద్యోగ సమస్యల పెరిగిపోయి, నా దేశ అభివృద్ధి కుటుంపడుతుందని ఆయన విమర్శించారు. హక్కుల సాధన కోసం ఈనెల 9వ తేదీ నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జి.విజయ్, రేపల్లె మధు, పూర్ణ, వేముల శ్రీను, ప్రతాప్, గుంటి నాగేశ్వరరావు, షేక్ మాబు, మహమ్మద్ యూసఫ్, కాంద్రగుంట తిరుపతిరావు, మొగిలి ప్రతాప్, రాగిరి శ్రీనివాసరావు, గాలి పవన్, పసుపులేటి మోహన్‌రంగ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై నిఘా పెట్టాలి



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌కుమార్

నకరికల్లు: అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు కీలక అంశాలపై మైనింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీ ఓపెన్ అయిన అర్జీలు, మ్యుటేషన్‌లు, రీసర్వే, ఇళ్లపట్టాల అర్జీలు, ఇళ్ల నిర్మాణ రెగ్యులరైజేషన్, గ్రావెల్ తవ్వకాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులందరూ హాజరు కావాలన్నారు. సమస్యలు లేని ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి నాగిని, సర్వే ఏడీ భానుకీర్తి, తహసీల్దార్ కె.పుల్లారావు, డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, ఆర్ఐ సిద్దయ్య, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు బలవన్మరణం

సత్తెనపల్లి: యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన సత్తెనపల్లి మండలం గుడిపూడి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గుడిపూడికి చెందిన చుక్కా థామస్, అనిత దంపతుల ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం అయింది. కుమారుడు చుక్కా సన్నీ(22) డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసి బెంగళూరులో చిన్న ఉద్యోగంలో చేరాడు. తండ్రి థామస్ సెంట్రింగ్ పని చేస్తుండగా, తల్లి అనిత కూలి పనులకు వెళ్తోంది. తల్లి అనితకు చెవి నొప్పి ఉండడంతో ఆమెకు సోమవారం ఆపరేషన్ చేయాల్సి ఉంది. దీనికోసం బెంగళూరు నుంచి సన్నీ గుడిపూడి వచ్చాడు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో గుడిపూడి సమీపంలో రైల్వేస్టేషన్‌కు కూత వేటు దూరంలో చెన్నై సూపర్ ఫాస్ట్ రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సన్నీ మృతదేహం చెల్లాచెదురుగా పడిపోవడంతో రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సోమవారం పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఏరియా వైద్యశాలకు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

రైతు సంఘం నేతలు



పెదకూరపాడు: అర్హత కలిగిన కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పీడీఎఫ్), రైతు సంఘం ఆధ్వర్యంలో పెదకూరపాడు తహసీల్దార్ ధనలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఓసీలోని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలన్నారు. గత ప్రభుత్వం కౌలు రైతులను కులాల వారీగా విభజించి ఓసీలకు ఇవ్వకపోవడం వల్ల అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే విధి విధానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కులాలకతీతంగా కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం నగదును కౌలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు దర్శి శేషారావు, ఎం.మస్తాన్‌రావు, కె.జాన్ బాబు, కె.చిన్నా, కె.సుబ్బారావు, షేక్ జానీ, కె.వీరయ్య, వి.జీవన్, ఆర్.దొరబాబు పాల్గొన్నారు.